క్లుప్తంగా

నియోజకవర్గంలో నేడు హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఆపార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.45 గంటలకు సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలోని మేరీ మాత నూతన దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 11.15 నిముషాలకు అద్దంకి మండలంలోని కలవకూరు గ్రామంలోని కవనెంట్ చర్చిలో, 12.45 గంటలకు పట్టణంలోని పసుమర్తి పాలెం చర్చిలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఘనంగా హనుమద్ వ్రతం



హనుమద్ వ్రతంలో పాల్గొన్న స్వాములు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా హనుమద్ వ్రతాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా 400 మంది ప్రసన్నాంజనేయస్వామి వారి మాల ధరించిన స్వాములు వ్రతంలో పాల్గొన్నారు. మాలధార స్వాములు ఆలయ ప్రదక్షిణలు చేసి వెంట తీసుకువచ్చిన ఇరుముడిలోని పూజా ద్రవ్యాలతో స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన సహాయ కమిషనర్ సుభద్ర ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీకృష్ణ గోశాలలో ధనుర్మాస పూజలు



కృష్ణుడి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాలలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణుడి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం గోమాతలకు విశేష పూజలు చేశారు. జనవరి 16 కనుమ పండుగ సందర్భంగా సాయంత్రం 4గంటలకు మేళతాళాలు, కోలాట భజనలతో గోమాతల నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ గోశాల కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పీ వెంకట దుర్గాకుమార్, అధ్యక్షులు దేవకి సుబ్బారావు, కార్యదర్శి నీరుకట్టు నరసింహారావు, కోశాధికారి నేరెళ్ళ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న గెలుపునకు మరింత కృషి



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర సెక్రటరీ మధుకర్, నూతన యువజన అధ్యక్షులు

చీరాల: వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో పదవులు పొందిన నాయకులు అంకితభావంతో పనిచేసి మళ్లీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి యాతం మధుకర్ సూచించారు. చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో చీరాల నియోజకవర్గంలోని చీరాల మండలానికి గవిని కోటేశ్వరరావు, వేటపాలెం మండలానికి ఆవుల అశోక్, చీరాల పట్టణానికి క్లస్టర్ ఇన్‌చార్జి-1 బీ.జగ్గయ్య, క్లస్టర్-2 ఇన్‌చార్జి రమేష్‌ను యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించడంతో ఆదివారం యువజన విభాగం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. యువజన విభాగం పట్టణ, రూరల్ అధ్యక్షుడు గానియమితులైన వారిని రాష్ట్ర కార్యదర్శి యాతం మధుకర్ అభినందించారు. తమకు పదవులు ఇవ్వడంపై సీఎంజగన్‌కు, ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

కొత్త నాటకానికి తెరలేపిన టీడీపీ

పర్చూరు (చినగంజాం): ఎన్నికల వేళ సమీపిస్తున్న తరుణంలో పోతుకట్ల గ్రామంలో టీడీపీ కొత్తనాటకానికి తెరలేపిందని మండల జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోతుకట్ల గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరాయంటూ టీడీపీ కార్యకర్తలనే తీసుకెళ్లి ఎమ్మెల్యే సమక్షంలో చేర్చడం దురదృష్టకరమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. గతంలో వీరయ్య అనే వ్యక్తి పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులనే బలపరచారని ప్రస్తుతం అతనే టీడీపీకి చెందిన 20 మందికి టీడీపీ కండువాలు కప్పించారని, ఇలాంటి చర్యలు చాలా దురదృష్ట కరమన్నారు. ఇకనుంచైనా టీడీపీ దొంగ నాటకాలు మానుకొని సక్రమంగా ఎన్నికలలో పోటీ చేసి గెలవాలని ఆయన అన్నారు.




కారంచేడులో విద్యుత్ వెలుగుల్లో ఏసుక్రీస్తు



వేటపాలెంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన సాల్వేషన్ ఆర్మీ ప్రేయర్ హాల్



కారంచేడులో రంగురంగుల విద్యుత్ దీపాలతో క్రిస్మస్‌కు సిద్ధమైన ఆర్‌సీఎం చర్చి



చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో.. స్టార్

ఏసు క్రీస్తు జననం.. లోకానికి శుభదినం

- నేడు క్రిస్మస్ పండుగ
- విద్యుత్ కాంతుల్లో మెరిసిన చర్చిలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కారంచేడు/పర్చూరు/మార్టూరు/చినగంజాం: క్రీస్తు జన్మదినం సర్వమానవాళికి శుభదినం, లోక రక్షకుడు జన్మించిన రోజును క్రైస్తవులు క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్. ఈసందర్భంగా ఆదివారం రాత్రి నుంచే పండుగ సంబరాలు మొదలయ్యాయి. చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. రకరకాల విద్యుత్ కాంతుల్లో చర్చిలు మెరిసిపోతున్నాయి. లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినంను పురస్కరించుకొని 'క్రిస్మస్' పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు అన్ని గ్రామాల చర్చిలు సిద్ధమయ్యాయి. గత ఆదివారం ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రతి చర్చి పరిధిలో ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సోమవారం జరగబోయే పండుగ కోసం కారంచేడులోని ఆర్సీఎం (పెద్ద చర్చి) ముస్తాబు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసు క్రీస్తు జన్మదినాన్ని ప్రతిబింబించేలా సెట్టింగులు ఏర్పాటు చేశారు. చర్చి ఫాదర్ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. దగ్గుబాడు లూథరన్ చర్చి, కారంచేడు గ్రామంలోని బేతేలు ప్రార్థనా మందిరం, ఎల్ఎఫ్ఎల్ చర్చితో పాటు మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, కొడవలివారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం, తిమిడెదపాడు గ్రామాల్లోని చర్చిలను రంగులతో అలంకరించారు.



క్రీస్తు జననం తెలిపే అలంకరణలో ప్రతిమలు



చినగంజాంలో విద్యుద్దీపాల అలంకరణలో చర్చి

మండల కేంద్రమైన చినగంజాంలో అంబేడ్కర్ నగర్, సతాయిపాలెం, బేతాళ వారిపాలెంలో చర్చిలను అత్యంత అందంగా అలంకరించారు. క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు ఆధ్వర్యంలో క్యారల్స్ తీసుకుని చిన్నారులు గ్రామంలో ఆదివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు.

తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు..

వేటపాలెం/చీరాల/చీరాల రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాలను ఆదివారం అందంగా ముస్తాబు చేశారు. చర్చిలకు నూతనంగా రంగులు వేసి, రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరింప జేశారు. ఆర్‌సీఎం చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి, మంకెవారిపాలెంలో చర్చిని, షాలేమ్ చర్చీలను రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంక రించారు. క్రైస్తవులు సోమవారం తెల్లవారు జాము నుంచి ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ ప్రార్థనలు చేయనున్నారు. ప్రతి ఇంటి ముందు రంగ రంగు విద్యుత్ దీపాలతో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసుకున్నారు.

చీరాల పట్టణం థామస్‌పేటలో థామస్‌పేట సంఘ పెద్దలు, వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. థామస్‌పేటలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో యెరిచర్ల ప్రకాష్, కొర్నెపాటి భాగ్యరాజు, గొర్రెముచ్చు ఇశ్రాయేలు, యెరిచర్ల రాజేష్, చింతా రవి, రత్నం, యూత్ తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ పండుగకు చీరాల పట్టణం ముస్తాబయ్యింది. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. చర్చిరోడ్డు మొత్తం విద్యుత్‌ద్దీపాలతో ముంచెత్తారు. అలానే జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ లూథరన్ చర్చిలో, పేరాల సెయింట్ మార్క్స్ బ్రాంచ్ చర్చిలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. అలానే మరియమ్మపేటలోని రోమన్ క్యాథలిక్ చర్చి (ఆర్సీఎం) చర్చి, బేరుపేటలోని సెంటినరీ సెయింట్ లూక్స్ చర్చిలు, కుందేరు ఒడ్డున గల బెరాకా చర్చి, శాంతి నగర్‌లోని లూథరన్ చర్చిలను విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు. ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమంలో ముఖ్య అతిథిగా డీఎస్పీ ప్రసాదరావు పాల్గొని పోలీసు సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్, ఎస్సైలు జిలాని, భాస్కరరావు, గోపి, సాల్మన్‌రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చినగంజాంలో ఆదివారం వేకువ జామున క్యారల్స్ నిర్వహిస్తున్న చిన్నారులు



చీరాల హాయర్ పేటలో విద్యుత్ వెలుగుల్లో క్రీస్తు



చీరాల: విద్యుత్ దీపాలంకరణంలో సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి

మరియమ్మపేటలో తొట్టెంపూడి సిస్టర్స్, కడియం బ్రదర్స్, కొటికల సిస్టర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు.

బల్లికురవ/అద్దంకి: క్రిస్మస్ సందర్భంగా ఆదివారం మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలతోపాటు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. బల్లికురవ, వల్లాపల్లి, నక్కబొక్కలపాడు, కొణిదెన, ఉప్పుమాగులూరు, కొప్పరపాలెం, మల్లాయపాలెం, చెన్నుపల్లి, వైదన, కొప్పరపాడు, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాల్లో నెలరోజులుగా ప్రతి రోజు రాత్రిపూట ప్రత్యేక ప్రార్ధనలు చేపడుతున్నారు. వేడుకల ముగింపులో భాగంగా ఆదివారం రాత్రి ఆయా గ్రామాల చర్చిల వద్ద సంఘ కాపరుల ఆధ్వర్యంలో అన్నదానం, రాత్రికి ప్రత్యేక ప్రార్ధనలు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలెం, పసుమర్తివారిపాలెం, ఎల్ఈఎఫ్‌నగర్, గుర్రాల కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తిమ్మాయపాలెం, తదితర గ్రామాల్లోని చర్చీలు విద్యుత్ బల్బుల కాంతులతో చర్చిలు కాంతులీనుతున్నాయి.



థామస్‌పేటలో కేక్ కట్ చేసిన నాయకులు



క్రిస్మస్ కానుకలు అందిస్తున్న ఉపాధ్యాయుడు సురేంద్ర



విద్యుత్ దీపాల వెలుగుల్లో వల్లాపల్లి చర్చి



చీరాల: విద్యుత్ వెలుగుల్లో సెయింట్ జాన్స్ ప్యారిష్ లూథరన్ చర్చి

వైద్య శిబిరానికి విశేష స్పందన

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 873 మంది ఈ ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక మెడికల్ క్యాంపులు, పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ, విద్యాభివృద్ధికి పూర్తి సహకారం, గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అనేక విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏడేళ్లుగా ప్రతీ నెల ఉచిత షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నామని ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. షుగరు రోగులు వైద్యులు సూచనలు, ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన భారీ ఎత్తున ప్రజలు

సత్యసాయి చూపిన మార్గాలు ఆచరించాలి

వేటపాలెం: సత్యసాయి బాబా చూపిన ప్రేమ కరుణ, శాంతి, సేవ మార్గాల్లో ప్రతి ఒక్కరూ జీవించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హెచ్ఎం గుత్తి హేరంబరావు సూచించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో గల రోటరీ కమ్యూనిటీ హాల్లో ప్రోబస్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సత్యసాయి బాబా జీవిత చరిత్ర గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాలను ఆదర్శంగా తీసుకొని జీవన ప్రయాణాన్ని కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆవుల పున్నయ్య, కార్యదర్శి బూసం షణ్ముఖేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పనామా లోహియా, గొల్లపూడి సీతారాం, కొసనం నాగమాంబ, గౌరాబత్తుని రవిబాబు, వలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

కారంచేడులో నేడు స్పందన రద్దు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలింకంగా రద్దు చేసినట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



పానెం హనిమిరెడ్డి



ఆమంచి కృష్ణమోహన్



కరణం వెంకటేష్

అద్దంకి: నియోజకవర్గంలోని క్రైస్తవులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, జాలి, ఆహింసా గుణంతో ప్రతి ఒక్కరూ మెలగాలని అలా మెలిగినపుడు విశ్వమానవ కళ్యాణం, శాంతి సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. తోటివారికి సహాయపడాలనేదే ఏసు క్రీస్తు బోధనల్లో ఇమిడి ఉన్న సారంశమని తెలిపారు. క్రైస్తవులంతా క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన కోరారు.

అందరూ శాంతి మార్గాన్ని అనుసరించాలి..

పర్చూరు (చినగంజాం): ఏసుక్రీస్తు చూపిని శాంతి మార్గాన్ని అందరూ అనుసరించాలని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరూ సోదరభావంతో మెలగాలని పేర్కొన్నారు.

చీరాల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ కుమారుడు జీసస్ మానవునిగా జన్మించిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు.

రేపటి నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు

మార్టూరు: మండలంలో ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 9 వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ మార్టూరు-1 సచివాలయ పరిధిలో, 28వ తేదీ మార్టూరులో 1,3 సచివాలయాల పరిధిలోనూ, 29వ తేదీ మార్టూరు 2,3 సచివాలయాలు, వలపర్ల, కోలలపూడి, రాజుపాలెం సచివాలయం పరిధిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జనవరి రెండో తేదీ ద్రోణాదులలో 1,2 సచివాలయాలు, బొల్లాపల్లి, రాజుపాలెం, జొన్నతాళి, జనవరి 4వ తేదీ నాగరాజుపల్లి, మార్టూరు-4, వలపర్ల-2 సచివాలయాల పరిధిలోనూ, 5వ తేదీ వలపర్ల-2, రాజుగారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోనూ, 6వ తేదీ వలపర్ల-2, రాజుగారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోనూ, 8వ తేదీ దర్శి, 9వ తేదీ కోనంకి గ్రామాల సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

200 మందికి అన్నదానం

చినగంజాం: స్థానిక హనుమ సాయి కుటీరంలో వేంచేసియున్న షిర్డీ సాయి మందిరం నందు ఆదివారం హనుమత్ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మందిరం నందు వేంచేసి ఉన్న హనుమంతునికి పంచ అభిషేకాలు నిర్వహించారు. బాపట్ల సత్యనారాయణ సాయి దంపతులచే హనుమద్ వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతుల అనంతరం సుమారు 200 మందికి ప్రసాద వితరణ నిర్వహించారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో శాప్‌నెట్ చైర్మన్



కేక్ కట్ చేసిన శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆదివారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య పాల్గొని కేక్ కట్ చేశారు. క్రీస్తు మార్గంలో అందరూ నడవాలని ఆయన కోరారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, అద్దంకి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

వేటపాలెంలో ఆయోధ్య రాముడి అక్షతలు

వేటపాలెం: వేటపాలెం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి శ్రీరాముడి అక్షతలు ఆదివారం తీసుకొచ్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో అయోధ్య రాముడి అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్ సభ్యులు మాట్లాడుతూ అయోధ్య నుంచి తెచ్చిన రాముడి అక్షతలను గ్రామంలోని అన్ని కుటుంబాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేయి హెక్టారుల్లో పంట నష్టం

బల్లికురవ: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్‌కు ఉద్యానవన శాఖ పంటలకు బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 252 మంది రైతులకు 26.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని మార్టూరు ఉద్యానవన శాఖాధికారి బీ. హనుమంతనాయక్ ఆదివారం తెలిపారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన పంటలన్నింటిని ఎన్యూమరేషన్ ద్వారా పరిశీలించినట్లు చెప్పారు. సంతమాగులూరు మండలంలో 86 మంది రైతులకు అరటి, బొప్పాయి 52 హెక్టారుల్లో రూ.12.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని అన్నారు. బల్లికురవ మండలంలో 166 మంది రైతులకు మిర్చి, అరటి, బొప్పాయి, ఉల్లి, బంతి 180 ఎకారాల్లో రూ.13.9 లక్షల మేర నష్టం వాటిల్లిందని అంచనాలు తయారు చేసి జిల్లా స్థాయి అధికారులకు నివేదిస్తున్నట్లు హెచ్‌వో వివరించారు. వ్యవసాయశాఖ పరంగా బల్లికురవ మండలంలో మొక్కజొన్న, వరి, జూట్, కంది, కూరగాయల పైర్లకు 1009 హెక్టారులకు నష్టం వాటిల్లినట్లు ఏవో ఎస్‌వీపి కుమారి వివరించారు.